

# ఓడిపోయిన మనిషి

ఇచ్ఛాపురపు జగన్నాధరావు

రాజేశ్వరి ఆ ఆఫీసు హాల్లో అడుగుపెట్టి ఒక్కసారి చుట్టూ చూసింది.

ఇద్దరు టైపిస్టులు చకచక టైపుచేసుకుంటూ అందులోనే నిమగ్నమైపోయారు. చుట్టూ మూడు బీరువాలూ, ...కూ్పా....ఇతర సామగ్రి.

తొందరగా నడిచివొచ్చిందేమో, రాజేశ్వరి కొంచెం అలిసిపోయింది. ఇంకా శ్వాస స్థిర పడలేదు. అంత వరుగున వొచ్చినా, అనుకున్న టైముకి అందలేదనే బాధ ఒకటి. రెండేళ్ళ ఆమె ఉద్యోగంలో ఆలస్యంగా వెళ్ళడం జరగలేదు.

ఈ రోజు కొత్తగా ఈ హెడ్డాఫీసులో చేరే రోజు ఆలస్యంగా రావడం ఆమెకి బాగా అనిపించలేదు. ప్రపంచంలో టైపురైటర్లూ, కీబోర్డులూ, వేళ్ళూ తప్ప ఇంకేమీ లేవన్నట్టు వాళ్ళిద్దరూ టైపుచేయడం చూస్తే ఆమెకి మరికొంచెం బాధ అనిపించింది-ఈ ఆఫీసుకి పోస్టింగ్ వొచ్చిన మొదటి రోజునే ఇలా ఆలస్యం కావడం!

కాని, తాను మాత్రం ఏమి చేస్తుంది?

"హల్లో రాజీ!"

సుగుణ నవ్వుతూ లేచివచ్చి రాజేశ్వరిని కౌగలించుకుంది. ప్రక్కన టైపు చేస్తూనే ఉన్న అమ్మాయిని పరిచయంచేస్తూ, 'నా ఫ్రెండు-ముంతాజ్!" అని, "ముంతాజ్! రాజీ మాట చెప్పేను కదా!" అంది.

"ఏం చెప్పేవేమిటి?" అంది రాజేశ్వరి.

"నీ సంగతంతా చెప్పేశాన్లే!" అంది సుగుణ.

ముంతాజ్ నవ్వుతూ తన ఛెయిర్‌లో కూర్చుంది.

"భయపడకులే! నువ్వు రాధలాగ మంచి-చాలా మంచిదానివని...."

"రాధ ఎవరు?"

"పోతాల్లో రాధ! గోపాలుడు మంచి వాడైనట్టే, మంచిపిల్ల రాధ! అలాగే రాజేశ్వరి! అరే! నీ పోస్టింగ్‌కి కంగ్రాట్స్ చెప్పనే లేదు!" అంది సుగుణ.

"ఇప్పుడు చెప్పేవుగా!"

"లేదులేగాని, తీరిగ్గా చెప్తాన్లే మరి, పద-ఆఫీసు మేనేజరు ఓమ్‌గారికి పరిచయం చేస్తాను!" అంటూ అవతలి గదిలోకి దారి తీసింది సుగుణ.

"ఓమ్‌గారంటే? పూర్తి పేరేమిటి?" అంది రాజేశ్వరి, ఆమెని అనుసరిస్తూ.

"ఆఫీస్ మేనేజర్. ఓ. యమ్! అంటే ఓం!" అంది సుగుణ.

"అలాగా!" అంది రాజేశ్వరి పరధ్యానంగా.

"అవును. మరి నీ సీటు నీకు తెలుసునా?"

"అంటే?"

"అదే-ఎవరి దగ్గర ఉంటావో___"

"నాకు తెలీదు!"

"గాడ్! పద. కిశోర్‌గారి దగ్గర అని ఓమ్‌గారు చెప్తారు."

రాజేశ్వరి జవాబిచ్చేలోగానే ఓమ్‌గారితో పరిచయం, ఆయన స్వాగతం చెప్పడం, కిశోర్‌గారి దగ్గర వేసినట్టు చెప్పడం, "మిగిలిన వివరాలన్నీ ఈవిడ-అంటే సుగుణగారు చెప్తార్లెండి" అనడమూ జరిగిపోయింది.

రాజేశ్వరి సుగుణతో కలిసి వెనక్కి తిరిగి వెళ్ళబోతోంటే, ఓమ్ పిలిచి, "చూడండీ!...." అన్నాడు సంశయిస్తూ.

"ఏమిటి?" అంది సుగుణ.

"అహాఁ! ఏం లేదు...." అని, అటూ ఇటూ చూసి, "అదే! ఒకటడుగుదామనీ...." అని నీళ్ళు నమిలాడు ఓమ్.

రాజేశ్వరి అతని వైఖరి చూసి గాభరా పడింది.

"అడగండి....అడగండి...."అంది చాలా సామాన్యంగా సుగుణ కొంచెం నవ్వుతూ.

"అదే .... మీరిద్దరూ .... అదే.... ఓల్డ్ ఫ్రెండ్సా?...."

ఈసారి రాజేశ్వరికి నవ్వొచ్చింది.

"అవును." అని సుగుణ రాజేశ్వరితో ఒక్క అడుగువేసేసరికి, "అయితే సుగుణగారూ! ఆవిడకన్నీ సరీగా తెలియజెప్పండి" అన్నాడు ఓమ్, రహస్యం గట్టిగా చెప్తోన్నట్టు.

సుగుణ మళ్ళీ నవ్వి, "అలాగేనండీ!" అని, రాజేశ్వరితో తిరిగివచ్చి "పద! కిశోర్ గారికి ఇంట్రడ్యూస్ చేస్తే నా డ్యూటీ అయిపోతుంది." అంది.

"అది సరేగాని, ఆ మిస్టరీ మాన్‌గారి మిస్టరీ ఏమిటే?" అంది రాజేశ్వరి.

"చెప్తాన్లే-ఓమ్‌గారికి మిస్టర్ దొరకనే దొరకదుగాని, దొరికినదాన్ని ఆయన ఒదిలిపెట్టడు. పద. అదంతా ఇప్పుడు కాదుగాని, ముందు నీ బాస్‌కి రిపోర్టు చెయ్యి." అంది సుగుణ.

రాజేశ్వరిని తీసికెళ్ళి, "ఈమె రాజేశ్వరి సార్! ఓమ్‌గారు మీ దగ్గర వేశారు!" అంది సుగుణ చాలా సీరియస్‌గా.

రాజేశ్వరి "గుడ్ మార్నింగ్" చెప్పి "సారీ. ఇవేళ టైముకి రాలేకపోయాను...." అంది.

"నో మేటర్! నో మేటర్!" అన్నాడు కిశోర్.

రాజేశ్వరి అతన్ని పరీక్షగా చూసింది. అతని కళ్ళు చిన్నచేపల్లా అటూ ఇటూ నృత్యం చేస్తున్నాయిగాని, ఒక దగ్గర క్షణం కూడా నిలకడగా ఉండంలేదు. బుగ్గలు నగానికి పైగా సైడ్ బరన్స్.. నుదుటిమీది తల బాగా వెనక్కిపోతోంది.

పువ్వుల షైర్ట్, చేతిలో పైపు....

మొన్న మొన్నటిదాకా రాజేశ్వరి పనిచేసిన చోట ఆమె బాస్ చాలా పాతకాలం మనిషి. ఇతనికీ అతనికీ—

"మీరు ఇక్కడ చాలా హేపీగా ఉంటారని ఆశిస్తున్నాను" అన్నాడు కిశోర్.

"థాంక్స్!" అంది ఆలోచనలు కట్టిపెట్టి, రాజేశ్వరి.

"షూర్!" అని, కిశోర్ మళ్ళీ దిక్కులు వెతకడం ప్రారంభించేడు.

భుజంమీద చెయ్యివేసి సుగుణ చేసిన సూచనతో రాజేశ్వరి ఆమెతో వెనక్కివచ్చింది.

"ఇప్పుడు చెప్పు!" అంది తన టేబిల్ దగ్గర కూర్చుని టైప్‌రైటరుని పరిశీలిస్తూ, రాజేశ్వరి.

"అలాగేలే! నువ్వుండేదే ఇక్కడగా! ఈ కాగితాలన్నీ టైపు చెయ్యి!" అంది సుగుణ మళ్ళీ చిరునవ్వు తెచ్చుకుని.

ఆమె టైపు చెయ్యడం ప్రారంభించింది.

రాజేశ్వరి తన టేబిల్ సర్దుకోవడంలో నిమగ్నమైపోయింది. మరో పది నిమిషాలకి కిశోర్ పిలిస్తే వెళ్ళి డిక్టేషన్ తీసుకుంది. ముగించి ఆమె వెళ్ళిపోతోంటే అతను కాఫీ ఆర్డర్ చేసి ఆమెకి అవసరమైన సూచనలిచ్చి, "నెలరోజులై స్టెనో లేక చాలా విషయాలు వెనుకబడ్డాయి. మీరవన్నీ చూసుకోవాలి" అన్నాడు.

"అలాగే!" అంది రాజేశ్వరి.

ఆమెని గురించి అన్నీ అడిగి, చివరికి, "మీరు కాదనకుండా వచ్చినందుకు చాలా సంతోషం!" అన్నాడు కిశోర్, కాఫీ తీసుకుంటూ.

రాజేశ్వరి కొంచెం ఆశ్చర్యపడింది.

"నేను కావాలనే రిక్వెస్ట్‌మీద వచ్చాను" అంది.

"అది కాదు నేననేది. ఈ ఊరు కావాలనే వచ్చినా—అదంతా ఎందుకులెండి! బీ హేపీ!" అన్నాడు.

రాజేశ్వరి బయటికి వచ్చేసరికి సుగుణ లేదు. ముంతాజ్ టైపు చేసుకుంటూంది. రాజేశ్వరి జరిగిన సంభాషణని గురించి ఆ రోజు అడగలేకపోయింది.

పని తొందరలో మరో పది రోజులలాగే గడిచిపోయాయి. అప్పటికి రాజేశ్వరికి ఆఫీసూ, కిశోర్....అన్నీ బాగా అలవాటయిపోయాయి.

ఒక సాయంత్రం రాజేశ్వరి బాగా ఆలస్యంగా ఆఫీసు వదిలి బయటికి వస్తూంటే సుగుణ వెయిటింగ్ రూములో కనిపించింది. రాజేశ్వరి బాగా అలిసిపోయివుంది - రోజంతా ఊపిరి తీసుకోలేనంత పని. కిశోర్ చాలా మంచి మనిషి కావడాన్న అంత పనిన్నా ఉన్నందుకు నొచ్చుకుంటూనే ఉన్నాడు. అడపా తడపా కాఫీ, కూల్‌డ్రింక్సూ తనతోపాటు ఆమెకి ఇస్తూనేవున్నాడు. లేకపోతే తనిపాటికి ఇంకా ఎంత అలిసిపోయి ఉండేదోననుకుంది.

సుగుణని చూసి కొంచెం ఆశ్చర్యపడి, "అరే! నువ్వూ ఇంకా వెళ్ళలేదా?" అంది రాజేశ్వరి.

"లేదు." అంది సుగుణ పరీక్షగా రాజేశ్వరి ముఖంలోకి చూస్తూ.

"ఏం అలాగ చూస్తున్నావు?" అంది రాజేశ్వరి కొంచెం ఆశ్చర్యంగా.

ఒక్క నిమిషం ఆగి, "ఏమీ లేదులే.... నీకోసమే చూస్తూ నిలబడ్డాను. పద." అని బేగ్‌తీసుకుని తానూ లేచి బయలుదేరి, "ఏం, ఇంత లేటుగా వెళ్ళినా లిఫ్ట్ ఇస్తాననిలేదా, మీ బాస్?" అంది.

నడుస్తూ, చిరునవ్వుతో, "ఇస్తానన్నాడు." అంది రాజేశ్వరి.

"మరి?"

"వద్దన్నాను."

"ఏం?"

"మాటవరసకి ఆఫర్ చెయ్యగానే సరే నంటే ఎందుకో చిన్నతనం కదా!"

"తరవాత?"

"ఆల్‌రైట్! అన్నాడు మానవుడు — టాక్సీలో పోయి క్లెయిమ్ చేసుకొమ్మన్నాడు. మళ్ళీ లిఫ్ట్ మాట అడుగుతాడేమో, అలాగే నందామనుకున్న ఆశ...." నవ్వేసింది రాజేశ్వరి.

"పోనీ పద. టాక్సీలో పోదాం." అంది సుగుణ.

"వద్దులే—రాత్రివేళ! బస్‌లో పోదాం. కాని, నువ్వెందుకు అంత ఆలస్యంగా కూర్చున్నావు?" అంది రాజేశ్వరి, బస్ స్టాప్‌కి నడుస్తూ.

"నీకోసం...."

"నిజంగా?"

"అవును. పది రోజులనించి నీకు జ్ఞాపకం రాలేదు కానీ....మనం స్నేహితులం అని నేను మరిచిపోలేదు!" అంది సుగుణ.

కొంచెం ఆశ్చర్యపడింది రాజేశ్వరి.

నొచ్చుకున్నట్టు తెలియనివ్వకుండా ఉండడానికి ప్రయత్నిస్తూ "చాలా బిజీగా ఉంది. ఊపిరి తీసుకోలేకపోయినట్టు ఉంది ఈ పది రోజులూ....మరేమీ అనుకోకు" అంది రాజేశ్వరి.

"ఏమిటంత బిజీ?"

"నెలరోజులనించి ఎవరూ లేరు కదా! ఎరియర్స్ అన్నీ చెయ్యవలసివచ్చింది. అక్కడికీ కిశోర్ చాలా సహాయం చేశాడు గనక ఇవేళకైనా పని ముగిసిందిగాని, లేకపోతే మరో పదిరోజులు పట్టివుండేది!" అంది రాజేశ్వరి.

బస్‌స్టాప్‌లో నిలబడి ఇద్దరూ టైమ్ చూసుకున్నారు.

హఠాత్తుగా సుగుణ "నువ్వు ట్రాన్స్‌ఫర్‌కి ఎందుకు పెట్టేవు? మీ అమ్మకి ఆ వూరు అంత నచ్చింది కదా?" అంది.

"నీకు తెలీదా?" అంది రాజేశ్వరి ...నగా

వెలుతురులో ఆమె ముఖంలో కవళికలు చూస్తే సుగుణలో చాలా ఆలోచనలు రేకెత్తి ఉండేవి.

"తెలీదు."

"హెడ్డాఫీసులో అందరికీ అన్నీ తెలీవులే. మన ఉద్యోగాలు చిన్నవి. నలుగురికీ ఆసక్తి కలిగే ప్రాముఖ్యత ఏమీ లేదు" అంది పొడిగా సుగుణ.

"బస్ వచ్చేలాగ లేదు. టాక్సీలో పోదామా?" అంది రాజేశ్వరి మళ్ళీ గడియారం చూసుకుంటూ.

"ఏం? ఇంటిదగ్గర ఏమైనా ఎట్రాక్షన్ ఉందా?" అంది సుగుణ నవ్వుతూ

"ఉంది. రాకూడదూ? చూద్దువుగాని!"

"అదేనా? లేక నా ప్రశ్నకి జవాబు చెప్పడం ఇష్టంలేకనా?"

"అదేంలేదు - అందరికీ తెలుసననుకున్నప్పుడే అభ్యంతరం లేదు-నీకు చెప్పడానికేం?"

"అయితే పద. కాఫీ తాగుతూ కథ చెప్పుకుని వెళదాం." అంది సుగుణ.

రాజేశ్వరి చెప్పిన కథలో నిజానికి కొత్త ఏమీలేదు - అందమైన పిల్ల. ఆమెమీద అధికారం చెలాయించే ఉద్యోగి. అతని వయస్సెంత అయితేనేం? తలలు బోడులైన తలపులు బోడులా అని అనలా? అతనెలా ఉంటేనేం? అధికారంలో ఉంది అందం అంతా.

"ఉద్యోగంలో చేరిన నాటినించే అతను నాంది పలికేడు. నాలాటి బ్యూటిఫుల్ గర్ల్‌కి ఇలాగ దిక్కుమాలిన ఉద్యోగాలు చెయ్యవలసి రావడం.... షేమ్!.... అన్నాడు. తనకే అధికారం ఉంటే...."

అతను చాలా చేసివుండేవాడు.

కనీసం అలా అన్నాడు.

వీటన్నిటిలోనూ మాటలతో ఆగినా, మిగిలిన వ్యక్తిగత విషయాలలో అతను మాటలతో ఆగలేదు.

"భార్య ఉంది. ఏమిటి లాభం? చాలా పాతకాలం మనిషి. ఆమెలో స్పందనలేదు" అన్నాడు.

"నీలో ఉన్న జీవనరాగం ఆమెలో లేదు" అని వాపోయేడు.

"నీకోసం ఏమైనా చేస్తాను. నా పిల్లల సాక్షి!" అన్నాడు తన ఆరుగురు పిల్లలమీద ఒట్టు పెట్టుకుంటూ.

ఏమైనా సరే, చేసేలాగే కనిపించేదతను— వీలయినప్పుడల్లా చేతులు తాకేవాడు- వీలయితే మరెక్కడయినా సరే.... నిష్పక్షపాతంగా.

ఆమె ముఖంలోనూ, చేతల్లోనూ, మాటల్లోనూ చూపే విముఖత అతనికి కనిపించలేదు.... కనిపించినా, బహుశా, వాటికీ తన కనువైన అర్థత చెప్పుకొని ఉంటాడు.

ప్రతిరోజూ ఉదయం, విష్ చెయ్యగానే. "ఈ రోజు ఇంకా అందంగా ఉన్నావు!" అనేవాడు.

రూమ్‌కి వెళ్ళి విష్‌చెయ్యడం మానేస్తే అతనే పిలిచేవాడు.

ప్రతి సాయంత్రం లిఫ్ట్ ఇస్తాననేవాడు.

వొద్దంటే వాదించేవాడు.

ఉదయం తన బస్‌స్టాప్ ముందు ఆగి ఎదురుచూసేవాడు.

ఎన్నివిధాల రాజేశ్వరి జీవితాన్ని అతను కలుషితం చెయ్యగలడో అన్ని విధాలా చేశాడు.

తాను ఉద్యోగం చెయ్యకపోతే గడవని పరిస్థితి రాజేశ్వరిది.

ఆమె జీతంమీద ప్రాణం పెట్టుకుని, ఈర్ష్యతోనూ, అనుమానాలతోనూ ఆఫీసు నరకంనించి ఇంటి నరకానికి తలుపులు తీసే


**GOING TO U.S.A., U.K., SINGAPORE, JAPAN**

*Contact us for*

Passports, Reserve Bank Clearance, Visas
and other travel formalities

**IATA Approved Agent**


**Travelexpress**

**Hotel Apsara Arcade,**

6-134, Waltair Main Road,

VISAKHAPATNAM-530002. (A.P.)

Telephone : 2016, 3172. Telex : 234 Cable : 'TRAVEXPRES'



అలవాటు ఆమె తల్లిది.

జరిగేదంతా చెప్పుకునేందుకు ఎవ్వరూ లేరు.

అలాటి నరకంలోనుంచి చివరికిలాగ బయటపడింది రాజేశ్వరి. ఉన్నవీ లేనివీ కారణాలన్నీ రాసి, ఈ ఊరికి ట్రాన్సఫర్ తెచ్చుకునేసరికి— దేవుడు వరం ఇచ్చినట్టు వుంది." అంది రాజేశ్వరి.

అన్నీ విని, పెద్ద నిట్టూర్పు విడిచింది సుగుణ.

"బాధపడుతున్నావా?" అంది రాజేశ్వరి.

"అవును...."

"ఎందుకని?"

"నిన్నుచూసి...."

"అంతా ముగిసిందిగా?"

"ఒక అధ్యాయం ముగిసింది...."

"అంటే?"

"ఏమీలేదులే- మానవులు - అందులోనూ ఆడవాళ్ళు.... ఎలా జీవిస్తారో ఆలోచిస్తున్నాను...."

"పెద్ద ఫిలాసఫరువైపోతున్నావు!"

"కాదులే- కానీ...."

"చెప్పు...."

"ముందు నువ్వు చెప్పు- ఈ పదిరోజుల్లోనూ నీ జీవితం ఎలా ఉంది?"

"సుఖంగా ఉంది. ఇంటిదగ్గర కూడా చాలా నయమే!"

"నిజంగా?"

"అవును.... అంటే, ఉండీ ఉండీ రాత్రి వాడు నా పీడకలల్లోకి వొస్తాడు తప్ప!"

"ఆఫీసు- ఎలా ఉంది?"

"బాగానే ఉంది. కిశోర్ - పెద్దమనిషి.... తన పని చేసుకుంటాడు- నా పని చేసుకోనిస్తాడు."

"మీ పాత బాస్ పేరేమిటీ?"

"సుబ్బారావు."

"సుబ్బారావులాగ కాదా?"

నవ్వింది రాజేశ్వరి.

"ఛీ! వీళ్ళిద్దరికీ ఎంత తేడా! అసలు మనుషుల ఆకృతిలోనే పోలికలేదు...."

"ఏం?"

"ఆ పిలకలాటి జుత్తూ వాడూ- ఆ సుబ్బారావుకీ కిశోర్‌కీ- చాలా తేడా ఉంది!"

"అలాగా!" అంది రాజేశ్వరి నవ్వుతూ.

"నవ్వడానికేం లేదు. మనిషిగా మనిషిని గురించి చెప్తున్నాను." అంది రాజేశ్వరి, గంభీరంగా.

"మనిషిగానే నవ్వుతున్నాను. పద- ఇంకా ఆలస్యం అయితే టాక్సీలు గూడా దొరకవు!" అంటూ బిల్ చెల్లించి లేచింది సుగుణ.

"నువ్వేమిటి చెప్తానన్నావు?" అంది రాజేశ్వరి, ఆమెని అనుసరిస్తూ.

"ఏమీ లేదులే!...." అంది సుగుణ. అనుకోకుండా బస్ దొరకడంవల్ల ఇద్దరూ బస్‌లోనే వెళ్ళిపోయారు.

ఆ తరువాత సుగుణా, రాజేశ్వరీ, రోజూ కలుస్తూ ఉండేవారు. ప్రతీరోజూ సుగుణ ఒకటి రెండుసార్లు "మీ బాస్ ఎలాగ ఉన్నారు?" అని అడుగుతూనే ఉండేది- "బాగానే ఉన్నాడు" అని రాజేశ్వరి చెప్తూనే ఉండేది. ఒక్కొక్కప్పుడు అతన్ని గురించి ఒకటి రెండు మంచి మాటలుకూడా చెప్తూనే ఉండేది.

ఆ తరవాత ఒకరోజు రాజేశ్వరి జ్వరంగా ఉండే, ఆఫీసుకి వొచ్చింది. ఒక గంట పని చేశాక, కిశోర్ "ఏమిటి అలా ఉన్నారు?" అని అడిగాడు.

"తల నొప్పి" అంది రాజేశ్వరి.

"సరే- ఇంటికి వెళ్ళండి" అన్నాడు.

"అంత ఎక్కువగా లేదు. ఒక అరగంట రెస్టు తీసుకుంటే అదే తగ్గుతుంది" అంది.

"ప్రయత్నించండి. బాగులేకపోతే వెళ్ళిపొండి" అన్నాడు కిశోర్.

రాజేశ్వరి వొచ్చేసరికి సుగుణ తీరిగ్గా కూర్చుని ఉంది. ఆమెని చూసి, దిగ్గున లేచి, "ఆ స్కాండ్రల్ మళ్ళీ ప్రారంభించేడన్నమాట!" అంది.

అదేమీ బోధపడక, తెల్లబోయి చూసింది రాజేశ్వరి.

"నీకు చెప్దామనుకోలేదు. నీ మనస్సు అనవసరంగా పాడుచెయ్యడం ఎందుకని. ఊరుకున్నాను...."

"తల నొప్పిగా ఉంది" అంది నీరసంగా, రాజేశ్వరి.

"అవును. ఇన్నాళ్ళనించీ నాటకం ఆడేవా లేక అర్థం కాలేదా?" అంది సుగుణ, కోపం, బాధ కలిపి.

రాజేశ్వరి మాట్లాడలేదు.

"ఏమయింది?" అంది రెట్టించి, రాజేశ్వరి.


"ఏమీ లేదు...."

"ఇంకా అబద్ధాలాడకు.... ఆ కిశోర్ మా ఆఫీసులో చాలా ఫేమస్!" అంది రాజేశ్వరి.

"దేనికి?"

"ఇలాటి రొమాన్సులకి- ఇప్పటికి ఇద్దరి జీవితాలు నాశనం చేసేడు...."

రాజేశ్వరి చేతుల్లో తలపెట్టుకుని వింటూ



న్నది.

"ఒకామె రిజయిన్‌చేసి పత్తా లేకుండా పారిపోయింది. అందుకే ఎవ్వరూ అతనిదగ్గిర పనిచెయ్యరు. మీ సుబ్బారావు వ్యవహారం మెట్టువించి పెట్టుకిగానీ, ఇతను రాజంప్! ఇంతకాలం అతను ఊరుకోడమే ఆశ్చర్యం!"

రాజేశ్వరి జాగ్రత్తగా వింటోంది

"ఇంతకీ, ఏమయింది?"

రాజేశ్వరి నీరసంగా, "తల నొప్పిగా ఉంది" అంది.

"ఉంటే?"

"అతనడిగితే, ఆ మాట చెప్పేన ..."

"ముద్దెట్టుకున్నాడా?"

"లేదు."

"మరి?"

"ఇంటికి వెళ్ళిపొమ్మన్నాడు...."

"తరవాత!"

"ఇక్కడికి వొచ్చేను- నీ మాటల వింటున్నాను."

గాలి తీసిన గుమ్మటంలాగ అయింది- సుగుణ.

"అంతేనా?" అంది.

"అవును" అంది రాజేశ్వరి.

"మరేం, అలాగ ఉన్నావు?"

"తలనొప్పిగా ఉంది!"

ఇంక మాట్లాడలేదు సుగుణ.

ఆమెకి కొంచెం కోపం వొచ్చింది. అది రాజేశ్వరి మీదనో, కిశోర్ మీదనో ఆమెకే స్పష్టంగా తెలియలేదు.

రాజేశ్వరి చిరునవ్వుతో ఊరుకుంది.

ఇదంతా జరిగాక వాళ్ళిద్దరికీ మధ్యన అస్పష్టంగా ఏదో అగాధంలాగ వొచ్చి, వారిద్దరూ దూరమయారు. సుగుణ అనుకున్నది జరగలేదు. రాజేశ్వరి ఆశించనిదీ జరగలేదు. కాని.... జరిగినదానిలో పరస్పరం ఏదో నేరం చెయ్యబడిందన్న భావం ఇద్దరిలోనూ ఉంది.

మరో నెలరోజుల్లో సుగుణ రూము మారడంవల్ల ఆ దూరం మరింత ప్రస్ఫుటం అయింది. అక్కడ విషయాలకీ జీవితానికీ అలవాటుపడ్డ రాజేశ్వరికి కొత్తలో అవసరం అయిన ఆలంబన కూడా అక్కర లేక పోయింది. ఈ కొత్త పరిస్థితులకి ఆమె సంతోషించనూ లేదు, బాధపడనూ లేదు.

కిశోర్ వెనకాల ఉన్నదంతా తెలిశాక కూడా రాజేశ్వరి తన ప్రవర్తనలో మార్పు రాకుండా ఉండిపోయింది. అతని స్వరూపం క్రమంగా అలవాటు అయిపోయింది. నాట్యం చేసే అతని కళ్ళు ఆమెలో ఏ ప్రత్యేకమైన భావాలనీ కలుగజేయడం మానివేశాయి.

కాని ఒకకొత్త ఆలోచన ఆమెలో కలిగింది.

కిశోర్ తనని కనిపెడుతున్నాడు.

తాను తల వొంచుకుని పనిచేసుకుంటూన్నా, అతను కూడా పనిలోనే ఉన్నా, అతను తనని గమనిస్తున్నాడు .... పరిశీలిస్తున్నాడు—

ఎందుకు?

తన అనుభవం నియమితమే అయినా లోకపు అనుభవం అలాగకాదు. తనకు తెలుసును- ఎందుకో. ఎవరూ మరీ విడమరిచి చెప్పకుండానే వివరాలన్నీ రాజేశ్వరికి తెలుసును.

తాను చక్కగా ఉంటూందని తనకి చాలా మంది చెప్పేరు. వాళ్ళ కళ్ళలోనించి కనిపించే తన చక్కదనానికి కిశోర్ కళ్ళలోనించి కనిపించే చక్కదనానికి భేదం ఉందని క్రమంగా అంగీకరించింది రాజేశ్వరి. ఇతని కళ్ళలో వేడి ఉంది, ఆశ ఉంది. అనుభవాలు చెప్పిన అర్థాలూ, అసంతృప్తులూ ఉన్నాయి.

సుబ్బారావులాగ కాదు.

కానే కాదు!

ఇతను.... కిశోర్.... వేరు!

మరో మూడునెలలు గడిచినా, కిశోర్ ఎప్పటిలాగే ప్రవర్తిస్తున్నాడు. కొన్ని అలవాట్లు ఉన్న మనుషులు కొంత వయసు వొచ్చాక మారలేరనీ, ఏదో ఒకరోజున కిశోర్ మారిపోతాడనీ, అనుకున్న రాజేశ్వరి కొంత ఆశ్చర్యపడింది.

ఒకరోజు ఆమె ఉదయం విష్ చేసేసరికి అతను "హేపీ బర్త్‌డే!" అన్నాడు.

ఆరోజు ఇంగ్లీషుతేదీ ప్రకారం తనపుట్టిన రోజన్న సంగతే జ్ఞాపకంలేదు రాజేశ్వరికి. థేంక్స్ చెప్పి, అతను ఆఫర్‌చేసిన కూల్ డ్రింక్ తాగి బయటపడేసరికి జరిగినదంతా చాలా తియ్యటి అనుభవంలాగ అనిపించింది రాజేశ్వరికి. కొంతకాలం ముందు తానతని విషయంలో వేసుకున్న అంచనాలన్నీ తారుమారు కాలేదని ఆమె మళ్ళీ లెక్క వేసింది.

కాని,ఆ తరవాత కొంతకాలం అతిసామాన్యంగా, ఉద్యోగికీ ఉద్యోగికీ మధ్య ఉండే సాధారణ సంబంధాలుతప్ప మరేవీ లేకుండానే జరిగిపోవడంతో మళ్ళీ ఓడిపోయినట్టు బాధపడింది రాజేశ్వరి. అతనేదో ఒకరోజున తన గుణం చూపిస్తాడనే ఆలోచన క్రమంగా నీరసించసాగింది. అలాగ జరిగితే తరవాత

ఏం జరుగుతుందనే ప్రశ్న వొచ్చిన మొదటి రోజుల్లో రాజేశ్వరికి చాలా జవాబులు వొచ్చేవి- క్రమంగా ఆ జవాబులు మరీ మరీ అస్పష్టం అవసాగాయి. చివరికి ఆ ప్రశ్నలో ఉత్తర భాగం కూడా స్పష్టంగా ఆమె మనసులోకి వొచ్చేదికాదు.

ఇదొక ఆట—

ఎదురుచూసే ఆట....

ఆట్టే ఆశలులేని రాజేశ్వరి జీవితం ఇంకా చాలావరకూ ఇలాగే అడ్డంకులు లేకుండా సాగే సూచనలన్నీ ఉన్నాయి.

తాను ఓర్పుగా ఎదురుచూడగలదు.

అతను?

తమ మధ్య కిశోర్ ఎప్పుడూ దూరం ఎక్కువే ఉంచినా, ఇంక ఏమీ జరగక పోవడంతో ఆ దూరం ఇంకా ఎక్కువై పోతూందన్న అసంతృప్తి పెరుగుతోంటే ఒకనాడు మరొక ఉదంతం జరిగింది.

అనుకోకుండా రాజేశ్వరీ సుగుణా ఆఫీసు నుంచి కొంచెం ఆలశ్యంగా బయటికి వొస్తూ కలిశారు. సుగుణ ఇల్లు మారిందిట- కొత్త ఇంటి వివరాలు చెప్తూ బస్‌స్టాప్ దగ్గరికి వొచ్చేసరికి సుగుణ బస్ వొచ్చి ఆమె వెళ్ళిపోయింది. మరో నిమిషానికే హఠాత్తుగా జల్లువొచ్చి రాజేశ్వరి తడిసిపోయింది. షెల్టర్ ఏమీలేని బస్‌స్టాప్ కావడాన్న చలికి వొణుకుతూ నిలబడింది ఆమె. నాలుగైదు నిమిషాల్లోనే బాగా కారుమేఘాలు పట్టి చీకటిపడిపోయింది.

కారు తనపక్కగా ఆగేవరకూ రాజేశ్వరికి తెలీనేలేదు.

పైన వర్షంలోకి బుర్రపెట్టి, "సారీ.... నాతో వస్తారా?" అన్నాడు కిశోర్.

అప్పటిదాకా వర్షాన్నీ, బస్సులనీ, జీవితాన్నీ దూషిస్తూన్న రాజేశ్వరి ఒక్కసారి పరిస్థితులని మెచ్చుకుంది. ఇలాటి తడితడి సాయంత్రాల వొంటరితనాలలో ఎన్నో ఆలోచనల విత్తనాలు మొలుకలుపెట్టి కలల్లాంటి పువ్వులు పూస్తాయని ఆమెకి మెరుపులాటి ఆలోచన వొచ్చింది. సందేహిస్తే అతను అలాగే వెళ్ళిపోతాడు.

ఒక్క ఉదుటున కూర్చుంది.

చలిగా ఉంది.

లోపల, ఆకలిగా ఉంది.

అతని పక్కన కూర్చుంటే, ఏమిటో, గమ్మత్తుగా ఉంది. అతనేమైనా ఒక్కమాట అడిగితే పదిమాటలు చెప్దామని ఉత్సాహంగా ఉంది.

"మీ ఇల్లు ఎక్కడ?"

చెప్పింది రాజేశ్వరి.

మళ్ళీ మాటలాడలేదు కిశోర్. ఆమె చెప్పిన ప్రకారం తిన్నగా ఇంటికి తీసికెళ్ళి వొదిలేశాడు. ఆమె థేంక్స్ అని గొణిగింది. అతనికి వినపడ్డట్టేలేదు.

బాధపడింది ముందు. కాని, అప్పటి అతని ప్రవర్తనకీ దీనికీ ఉన్న భేదానికి అతనికి పూర్వజీవితంలో వాళ్ళమీదా, తన మీదా ఉన్న దృక్పథాలలో భేదం అన్న


## మీ అభిమాన రచయిత(త్రు)ల రచనలు:

**సి. ఆనందారామం :**

- జాగృతి 6-00
- మారే కాలంలో మారని విలువలు 6-00
- దశావతారములు 6-00
- మమతల కోవెల 6-00
- అజ్ఞాత బంధాలు 6-00
- గుళ్ళో వెలసిన దేవతలు 6-50
- శారద 7-50
- ఏది సత్యం? ఏదసత్యం? 7-50
- చీకటి కడుపున కాంతి 7-50
- నిరాశలో నిండుగుండె త్వరలో
- మనస్విని త్వరలో

**రేగులపాటి కిషన్‌రావు :**

- ఆమె వితంతువు కాదు 4-00

**కురుమద్దాలి విజయలక్ష్మి :**

- కథానాయికి
- అలివేణి
- ఓ స్త్రీ నీ అంతరంగం ఇదా?
- మారిన కాలంలో మారిన మనుషులు
- అశోకవనంలో సీత

(పై అన్నీ) త్వరలో

**కావిలిపాటి విజయలక్ష్మి :**

- చాకులాంటి లేఖ. 6-00
- అపశ్రుతులు 6-00

**ఉషశ్రీ :**

- రేడియో రామాయణం 15-00
- భాగవతము త్వరలో

**ఆకొండి వెంకటరత్నం :**

- ధార 5-00

## న్యూ స్టూడెంట్స్ బుక్ సెంటర్

ఏలూరు రోడ్డు :: విజయవాడ - 520 002

మాచే మరొక షోరూమ్ : ఏలూరు రోడ్డు, సోనోవిజన్ హాలు దగ్గర.

కారణం ఆలోచన ఆమెలోకి వెచ్చగా వొచ్చి, మళ్ళీ కొత్తకొత్తగా చిన్న చిన్న కథలు రాసుకోసాగింది, రాజేశ్వరి.

క్రమంగా ఆమె ఎదురుచూడడం కూడా ఎక్కువ అయిపోయింది.... ఇది ఆట కాకుండా, ఒక గంభీరమైన యుద్ధంగా ఆమెకి అనిపించసాగింది.... ఇందులో గెలుపు ఉంది. ఓటమి ఉంది. తన ఆత్మాభిమానాన్ని రెచ్చగొట్టే గెలుపు, ఓటమి....

నెలల తరబడి ఎదురుచూసింది రాజేశ్వరి.

కిశోర్ 'పెద్దమనిషి' గానే ప్రవర్తిస్తున్నాడు. అతన్ని మార్చే ఏ ప్రయత్నానికీ ఫలితం లేకపోతోంది.

తన హద్దుల్లోపలా, కొంచెం దాటీ, రాజేశ్వరి అతన్ని పరీక్షించకపోలేదు....కానీ, అన్నీ విఫలమయాయి.

రాజేశ్వరి సహనం క్రమంగా నశించి పోతోంది.

తనమీద తనకే నమ్మకపోతోంది.

ఏంచెయ్యాలి?

ఎన్నో రోజులు తీవ్రంగా ఆలోచించింది రాజేశ్వరి.

చివరికి అనుకోకుండా రాజేశ్వరి ప్రపంచం అంతా.

ఆరోజు....

చాలా కాలందాకా మరిచిపోలేనిరోజు.

లంచ్ టైములో అతని గదిలోకి వెళ్ళింది రాజేశ్వరి—తన పెన్ అక్కడ మరిచిపోయి, తెచ్చుకునేందుకు.

అతను లేడు.

లంచ్ కి బయటికి వెళ్ళి ఉంటాడు.

టేబిల్ మీద తన పెన్.

దాన్నికింద చిన్నది తెల్లది, ఒక కవరు.

మీదని....'R' అని మాత్రం.

తనకే!

రాజేశ్వరికి. R

కవరు విప్పింది.

"ఈ సాయంత్రం....ఏడున్నరకి...."

అంతే!

రాజేశ్వరి మారిపోయింది. రక్తం శరీరమంతా ఉరకలు వేస్తోంది.

అదన్నమాట!

కిశోర్ కి....భయం....జరిగిన అనుభవాల భయం!

కాని....అతను మారలేదు.

తాను....రాజేశ్వరి ఓడిపోనూలేదు.

ఇంటిలో ఉంటే అతను తప్ప మరెవ్వరూ ఉండరు....అతనికి ఏవిధమైన కుటుంబమూ లేదని ఏనాడో తెలుసుకుంది రాజేశ్వరి.

సాయంత్రం...

ఏడున్నర.

టాక్సీ దిగి అడ్రస్ మరోసారి చూసుకుని కాల్ బెల్ నొక్కింది—లోపల దీపం ఒక్కటి వెలుగుతోంది.

కదలిక ఏమీ ఉన్నట్టులేదు.

మళ్ళీ బెల్ కొట్టింది రాజేశ్వరి.

మరో నిమిషం పోయాక తలుపు తెరుచుకుంది.

"మీరా?" అన్నాడు కిశోర్—వెనక్కి అడుగులేస్తూ.

లుంగీ కట్టుకుని చెదిరిన జుట్టుమీదకి తోసుకుంటూ ఆశ్చర్యంగా చూస్తున్నాడు కిశోర్.

లోపలికి అడుగుపెట్టింది రాజేశ్వరి.

"ఎవరది కిశోర్?" అని అడిగింది.... అవతలి గదిలోనించి ఒక గొంతుక.

తలుపు వేసివుంది.

కాని, గొంతుక విన్నట్టే ఉంది.

"ఇక్కడికి .... ఇప్పుడు — ఎందుకు వొచ్చేరు?" అన్నాడు కిశోర్—అతని గొంతుకలో ఆత్రత.

"మీ ఉత్తరం చూసి...."

"నా ఉత్తరమా?—ఏదీ?"

బేగ్ లోనించి కవరు తీసింది.

రాజేశ్వరి వొణుకుతోన్న చేతులతో చూపించింది.

"ఇది....ఇది....మీది కాదు...." అన్నాడు కిశోర్.

రాజేశ్వరి తెల్లబోయింది.

"మరి?"

"నాది...."

"సారీ...."

"వెళ్ళిపొండి....ఆమె గోల చేస్తుంది...."

"ఎవరు?" ఆత్రుతగా అడిగింది రాజేశ్వరి.

కిశోర్ వేసి ఉన్న తలుపులవేపు చూపి—

"వెళ్ళిపొండి—ప్లీజ్!" అన్నాడు.

"ఎవరది, కిశోర్?"

మళ్ళీ లోపలినించి ప్రశ్న.

తెలిసిన కంఠస్వరం.

బాగా తెలిసినది.

చేతిలో ఉన్న కవరువేపు మరోసారి చూసింది — ఆ అక్షరం R కాదు. K కిశోర్ పేరులో—K.

కవరు కిందని పడేసి, త్వర త్వరగా బయటికి నడిచింది రాజేశ్వరి.

ఆ కంఠస్వరం....ఈ ఊరిలో....ఆ ఆఫీసులో ఉన్న తన స్నేహితురాలిదే....అనుమానం లేదు.

బయటదీపాలు క్రమంగాఆరిపోతున్నాయి.

ఆమె మనసులో దీపాలు క్రమంగా ఆరిపోతున్నాయి.

మనిషి ఓడిపోతే, అంతే.

తనవల్లనే ఆ ఓటమి వాస్తే, మరీని. ***